క్లుప్తంగా

నిధులు వస్తే పనులు పూర్తి చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: మండంలోని మాలపాడు కేజీబీవీ పాఠశాల సమస్యలను తెలియజేస్తూ 'చదువు కోసం ..వసతి కోసం' అనే శీర్షిక ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురణ కావడంతో దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. పాఠశాల ప్రత్యేక అధికారితో పాటు మండల విద్యాశాఖ అధికారి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. నాడు-నేడు ద్వారా మంజూరైన నిధులతో అదనపు తరగతి గదులు నిర్మించారని, అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు నిధులు అందిన వెంటనే పూర్తి చేస్తామన్నారు. అలాగే ఉపాధి హామీ నిధులు మంజూరైన వరకు పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించారని, అయితే నిధులు సరిపోకపోవడంతో గేటు బిగించలేదని, గేట్ లేకపోవడంతో చిల్లకంపతో రక్షణ చర్యలు తీసుకున్నామన్నారు. సరిపడిన నిధులు మంజూరు కాగానే చిల్లకంప స్థానంలో గేట్ ఏర్పాటు చేస్తామని నివేదిక సమర్పించారు.

మహోన్నతుడు ఏచూరి



ఏచూరి చిత్రపటానికి నివాళులు

పీసీపల్లి: తన దేహాన్ని ప్రజలకే అంకితం చేసిన గొప్ప కమ్యూనిస్టు సీతారాం ఏచూరి అని రిటైర్డ్ అగ్నిమాపక శాఖ ఉద్యోగి బి.విలియం అన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ పీసీపల్లిలోని విజయ నగర కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప మానవతావాది, మహనీయుడు, ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన మేధావి అని కొనియాడారు. పి.మహేష్, తలకొండపాడు మాజీ సర్పంచ్ వై విజయకుమార్, కొండ్రు ప్రతాప్, గుంటగాని పిచ్చయ్య, పారా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో పామూరు విద్యార్థిని ప్రతిభ



యోగాలో ప్రతిభకనబరిచి ప్రశంసాపత్రం అందుకుంటున్న జీహెచ్ఎస్ విద్యార్థిని

పామూరు: విశాఖపట్నం జిల్లా భీమిలిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.శాంతి సత్తా చాటి రాష్ట్రస్థాయిలో నాల్గవస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినికి శిక్షణనిచ్చిన పీడీ షేక్.మస్తాని, పాఠశాల హెచ్ఎం ఎం.రామస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలో జరుగుతున్న పూడికతీత పనులను మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ పరిశీలించారు. సమస్య పరిష్కారంలో భాగంగా ఆదివారం ఆయన పట్టణంలో పర్యటించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని పెద్ద డ్రైనేజీ కాలువల్లో మురుగు నీరు పారేలా శానిటేషన్, పారిశుధ్య కార్మికులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నీటి నిల్వలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ప్రజలను రోగాలకు గురి చేస్తున్నాయన్నారు. శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ సెక్రటరీ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏచూరి సీతారాం మరణం తీరని లోటు



ఏచూరి సీతారాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కొండపి(సింగరాయకొండ): సీపీఎం అగ్రనేత ఏచూరి సీతారాం మరణం తీరని లోటని పార్టీ మండల కార్యదర్శి కేజీ మస్తాన్ అన్నారు. సీతారాం సంతాప సభ కొండపి సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఎల్(న్యూడెమోక్రసీ) నాయకులు వై చంద్రశేఖర్, తాటాకులపాలెంసర్పంచ్ వన్నూరు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఓ పోరాట యోధున్ని కోల్పోయింద న్నారు. ఆయన అకాల మరణాన్ని ఎవ్వరూ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కోవూరు శంకర్, ముప్పరాజు బ్రహ్మయ్య, గడ్డం వందనం తదితరులు మాట్లాడారు.



కనిగిరిలో అధ్వాన్న పారిశుధ్యం



మున్సిపాలిటీలో ఫాగింగ్ మిషన్లు

సారూ.. కాస్త ఫాగింగ్ చేయరూ..

- పట్టణంలో తిరగని పెద్ద ఫాగింగ్ మిషన్లు
- ఫాగింగ్‌కు ఆయిల్ ఖర్చు నెలకు రూ 1.25 లక్షలా..?
- విలీన గ్రామాల్లో అధ్వాన్న పారిశుధ్యం..
- రోగాల బారిన ప్రజలు

కనిగిరి రూరల్: జిల్లాలో శరవేగంగా పెరుగుతున్న పట్టణాలు, జనాభాల్లో కనిగిరి ఒకటి. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య నిర్వహణ మాత్రం అధ్వానంగా తయారైంది. ఫలితంగా పట్టణంలో రోగాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులన్నీ జ్వరపీడితులతో నిండుకున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏటా రూ.4 కోట్ల మేర పన్ను వసూలు

కనిగిరి మున్సిపాలిటీలో 20 వార్డులు, సుమారు 14,300 గృహాలు, 53 వేల మంది జనాభా, సుమారు 24.5 చ.కి.మీ విస్తీర్ణం ఉంది. ఏటా రూ 14 కోట్ల వార్షిక ఆదాయం కాగా, రూ.4 కోట్ల మేర ఇంటి పన్నుల రూపంలో వసూళ్లు జరుగుతున్నాయి. నియోజకవర్గ కేంద్రంతో పాటు, రెవిన్యూ డివిజన్ కేంద్రం కావడంతో ప్రధాన పట్టణమైన కనిగిరిమున్సిపాలిటీలో తగినన్ని మౌలిక వసతుల కల్పనలో అధికారులు, పాలకులు విఫలం చెందుతున్నారనే విమర్శలున్నాయి. ప్రధానంగా కనిగిరి పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఏ వీధి చూసినా ఏముంది గర్వకారణం అన్నట్లు.. ప్రధాన పట్టణంతో పాటు, శివారు ప్రాంతాల్లో విలీన గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి దయనీయం. అధ్వాన్న పారిశుధ్యంపై మున్సిపల్ ముఖ్యనేత సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏవరి వైఫల్యం.. ఎవరి లోపం అనేది పక్కన పెడితే పారిశుధ్య లోపంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

చిన్నపాటి వర్షానికే.. రోడ్లపైనే మురికి నీరు..

ప్రధాన పట్టణంలో చిన్న పాటి వర్షానికే రోడ్లపైకి మురికి నీరు వచ్చి ప్రజలు అల్లాడుతున్నారు. కొన్ని కాలువలైతే నెలల తరబడి పారిశుధ్య క్లీనింగ్‌కు నోచుకోలేదు. చెత్త డంపింగ్ పాయింట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరిని వెక్కిరిస్తున్నాయి. మురికి నీటి కాలువలు, చెత్త కుప్పలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి దర్శనమిస్తున్నాయి.

రోగాల బారిన పడుతున్నా..

ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధులకు తోడు.. దోమకాటుతో కొత్త రోగాలు ప్రబలుతున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రవేటు ఆస్పత్రుల్లో చిన్నారులతో, జ్వరపీడితులతో నిండుకున్నాయి. పారిశుధ్యంపై పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సిన అధికారులు ఆ వైపు దృష్టి సారించడం లేదు. శానిటేషన్ అధికారులు ఆదాయ వనరులపై చూపిన శ్రద్ధ ప్రజా ఆరోగ్యం పట్ల చూపడం లేదనే విమర్శలున్నాయి. పట్టణం మొత్తానికి రెండు పెద్ద ఫాగింగ్ మిషన్లు ఉండగా... ఇటీవల హ్యాండ్ ఫాగింగ్ సెట్ మిషన్లు 10కి పైగా కొనుగోలు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. వీటి వినియోగం ప్రశ్నార్థకంగా మారిందంటే అతిశయోక్తి కాదు.

కొత్త అధికారులైనా శ్రద్ధ చూపుతారా..

బదిలీల్లో భాగంగా కనిగిరికి కొత్త కమిషనర్ డానియల్ జోసఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కనిగిరి మున్సిపాలిటిలో ఖాళీగా ఉన్న స్థానంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌కు పోస్టింగ్ వేశారు. వీరిద్దరు పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించి కనిగిరి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. 20 వార్డుల్లో ప్రాధాన్యత ప్రకారం పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహించి.. అత్యవసరమైన చోట కచ్చా డ్రైన్లు తీసి.. స్లమ్ ఏరియాల్లో బ్లీచింగ్ చల్లించి.. ఫాగింగ్ చేయించాలి. వారంలో రెండ్రోజులు, లేదా నెలలో 5 వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్ చేసినా.. కొంత మేర దోమ పోటు, పారిశుధ్య సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్గుంది.

ఫాగింగ్‌కు నెలకు ఆయిల్ ఖర్చు రూ 1.25 లక్షలా..?

ఎన్నికలకు ముందు సుమారు 16 టన్నుల బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసినట్లు నివేదికలు తయారు చేసిన అధికారులు.. అసలు బ్లీచింగ్ పౌడర్ ఏ వార్డులో చల్లారో.. ఏ వీధిలో చల్లారో అ వార్డు కౌన్సిలర్లకే తెలియదంటే అతిశయోక్తి కాదు. అసలు ఆ బ్లీచింగ్ బస్తాలు ఉన్నాయా.. లేదా అనేది కూడా పాలకవర్గానికి చెప్పక పోవడం శోచనీయం. ఇక ఫాగింగ్ మిషన్లకు, దాని వాహనానికి ఆయిల్ ఖర్చు పేరుతో ప్రతి నెల రూ.1.25లక్షలు లెక్కలు తయారు చేసినట్లు తెలిసింది. దీనికి సంబంధించి గత నెల వరకు బిల్లులను శానిటేషన్ అధికారులు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

గంగ ఒడికి గణనాథుడు



సీఎస్‌పురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుని వద్ద భక్తులు



పాకల తీరంలో నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

సింగరాయకొండ: మండలంలోని పాకల బీచ్‌లో ఆదివారం 9వ రోజు వినాయక నిమజ్జనాలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం కావడంతో నిమజ్జనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సీహెచ్ హజరత్తయ్య ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో బందోబస్తు నిర్వహించారు. బీచ్‌లో జరుగుతున్న నిమజ్జనాలను, తీసుకున్న జాగ్రత్తలను అడిషనల్ ఎస్పీ క్రైమ్ శ్రీధర్‌బాబు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై బి.మహేంద్ర, జరుగుమల్లి ఎస్సై పున్నారావు, ఎస్సై టి. శ్రీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో కొలువుదీరి వినాయక విగ్రహాలను ఆదివారం తొమ్మిదవ రోజు కావడంతో చాల గ్రామాల్లో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. పొన్నలూరు రామాలయం సెంటర్‌లో రామాలయం యూత్ ఏర్పాటుచేసిన వినాయక విగ్రహన్ని నిమజ్జనానికి తరలించారు. అంతక ముందు భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యువకులు కేరింతలు కొడుతూ ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సహంగా పాల్గొన్నారు. అనంతరం మేళతాళాలతో ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించి పాకల సముద్ర తీరానికి తరలించారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. 9 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడిని కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. సందుగడ్డ వీధిలోని వినాయక మండపం లడ్డు రు.3.10 లక్షలకు కసీదు నారాయణ, కలశాన్ని రు.95 వేలకు ఇండ్లా శ్రీనివాసులు, స్వామివారి నగదు మాలను రు.45 వేలకు బీజేపీ మండల అధ్యక్షుడు ఇండ్ల సత్యం పాటలో సొంతం చేసుకున్నారు. వి.బైలులో లడ్డును రు.30,116లకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నల్లి నరసింహులు, కలశాన్ని రు.45 వేలకు మాజీ సర్పంచ్ బత్తుల శ్రీనివాసులు దక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఎం భీమానాయక్, ఎస్సై బి.ప్రేమ్‌కుమార్‌లు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

పామూరు: సకలగణాధిపతి గణేశుని నిమజ్జనోత్సవం పట్టణంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక మల్లికార్జునరెడ్డి హాస్పిటల్‌వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహమూర్తిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. డాక్టర్ మల్లికార్జునరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని బొట్లగూడూరులో వినాయక నిమజ్జనం కన్నుల పండువగా సాగింది.



పామూరు హాస్పిటల్‌వీధి నుంచి నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



పాకల తీరంలో నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ క్రైమ్ శ్రీధర్‌బాబు



పొన్నలూరులో వినాయకున్ని నిమజ్జనానికి తరలిస్తున్న రామాలయం యూత్

ముస్లింలకు మీలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు



దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: ముస్లింలకు మీలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ మీలాద్ ఉన్ నబీ (ప్రవక్త పుట్టిన రోజు) పర్వదినం వేడుకలను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. అల్లాహ్ కృపతో సర్వమానావళి సుఖ సంతోషాలతో విరజిల్లాలని కాంక్షించారు. ప్రవక్త సూచించిన సన్మార్గం ఆచరణీయమన్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి కూడా వేర్వేరు ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగునిపై దాడి

- తీవ్ర గాయాలు

సింగరాయకొండ: వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా దివ్యాంగునిపై ఓ వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన స్థానిక సుందరనగర్ ఎస్టీ కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే..దివ్యాంగుడైన తడుపుల బాలఏసు కాళ్లకు పోలియో సోకింది. ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న వినాయక విగ్రహం ఊరేగింపు సందర్భంగా బాలయేసు, చేవూరి కిరణ్‌కు మధ్య గొడవ జరిగింది. స్థానికులు వీరిద్దరిని బుజ్జగించి పంపేశారు. తరువాత 12 గంటల సమయంలో బాలఏసు తన ట్రాక్టర్ తాళం తెచ్చుకునేందుకు కాలనీలో ఉన్న ట్రాక్టర్ వద్దకు వెళ్లగా అక్కడే ఉన్న కిరణ్ మళ్లీ అతనిపై దాడి చేసి గాయపరిచాడు. కాలితో గొంతుపై నొక్కడంతో చెయ్యి విరవటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడికి వచ్చిన భార్య నాగదేవి బతిమాలడంతో కిరణ్ అతన్ని వదిలిపెట్టాడు. గాయాలపాలైన బాలయేసును చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు.. కాలితో గొంతుపై నొక్కడంతో అతనికి మాట రాకపోవటంతో పాటు, ఎడమ చేయి కూడా కదిలించలేక పోవటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాలయేసుకు మాట రావటం లేదని, డాక్టర్లు మందులు ఇచ్చి పంపించారని చెయ్యి కూడా పైకి ఎత్తలేకపోతున్నాడు. ఈ మేరకు ఆదివారం బాలఏసు భార్య నాగదేవి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.



భర్త బాలయేసుతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన భార్య నాగదేవి

లక్ష్య సాధన దిశగా విద్యనభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రామిరెడ్డి, భాస్కర్‌రావు

పామూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన కోసం ఇష్టంతో కష్టపడి చదవాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, వివేకా, ఒమేగా విద్యాసంస్థల కరస్పాండెంట్ కల్లూరి రామిరెడ్డి, విద్యాసంస్థల సెక్రటరీ బండి భాస్కర్‌రావు అన్నారు. స్థానిక వివేక విద్యాసంస్థల్లో ఆదివారం వివేకా డిగ్రీకళాశాల, ఒమేగా జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్ల విద్యార్థి జీవితంలో కష్టపడి చదివితే మిగిలిన భావి జీవితం సుఖమయమవుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, కంప్యూటర్ పరిజ్ఞానం, సాంస్కృతిక అంశంతో పాటు సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా వివిధ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్లు బైరెడ్డి జయరామిరెడ్డి, బండి లక్ష్మీకుమారి, వెంగళరెడ్డి, ప్రముఖ న్యాయవాది మందిరెడ్డి రామసుబ్బారెడ్డి, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఎం మహాలక్ష్మయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, బీఈడీ ఇన్‌చార్జి రవిచంద్ర, డైట్ ఇన్‌చార్జి ఎం రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో గోపూజ, మహానివేదన ఆదివారం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అభిషేకం , ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కొమ్మినేని వెంకట్రావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గాజులపల్లి ధనలక్ష్మి, రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



చిన్నముప్పళ్లపాడు ఎస్సీకాలనీలో పోలేరమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు



నరవగోపాలుపురంలో పోలేరమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

హనుమంతునిపాడు: మండల పరిధి చిన్నముప్పళ్లపాడు ఎస్సీ కాలనీలో, కూటాగుండ్ల పంచాయతీ పరిధి నరవగోపాలుపురంలో ఆదివారం పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పొంగళ్లు, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పొంగళ్లను పొంగించి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి గుడి చుట్టూ ప్రదిక్షణలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కబడ్డీ విజేత సీఎస్‌పురం



కబడ్డీ విజేతలకు కప్, నగదు బహుమతి అందజేస్తున్న ఎస్సై, నిర్వాహకులు

సీఎస్‌పురం(పామూరు): వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సీఎస్‌పురంలోని పామూరు రోడ్డులో వంగవీటి మోహనరంగా యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రకాశం, నెల్లూరు రెండు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సీఎస్‌పురంకు చెందిన వంగవీటి మోహనరంగా (వీఎంఆర్) జట్టు విజేతగా నిలిచింది. నాలుగు రోజులుగా జరుగుతున్న ఈపోటీల్లో మొత్తం 22 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో వీఎంఆర్ యూత్‌ఫోర్స్ జట్టు రెడ్‌బుల్స్ జట్టు తలపడగా వీఎంఆర్ యూత్ ఫోర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఎస్సై ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆదిశగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. స్థానిక వినాయక విగ్రహం వద్ద ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రథమ బహుమతి రూ.15 వేలు సంగిశెట్టి శ్రీను, ద్వితీయ బహుమతి రూ.10 వేలు బోయిన రాయుడు, తృతీయ బహుమతి రూ.7 వేలు తోట నారాయణనాయుడు, షీల్డ్‌లు గాజుల నారాయణ, తోట అశోక్, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్ బొబ్బూరి మణిలు ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ చేతులమీదుగా క్రీడాకారులకు అందజేశారు. సంగిశెట్టి శ్రీనివాసులు, సురేష్, రవితేజ, వరలక్ష్మయ్య, పీరయ్యానాయుడు, తోటా పవన్, సంగిశెట్టి రాజా, పెరుగు రమేష్, బోయళ్ల ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

15 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ

సింగరాయకొండ: స్థానిక మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని ఐటీఐ కాలేజీ సెంటర్‌లోని ఇంట్లో దుండగులు 15 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం ఐటీఐ కాలేజీ సెంటర్‌లో నివసిస్తున్న నర్రా సుధాకర్ మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం పక్క ఇంట్లో ఉంటున్న సుధాకర్ బంధువులు దుస్తులు ఆరేసేందుకు రాగా ఇంటి తలుపు తీసి ఉండటాన్ని గమనించి సుధాకర్‌కు సమాచారం అందించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని 15 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సోమవారం సుధాకర్ హైదరాబాద్ నుంచి వస్తే ఎంత సొత్తు చోరీ అయిందో తెలుస్తుందని ఎస్సై బి.మహేంద్ర వివరించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

పామూరు: రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని అంకభూపాలపురంలో ఆదివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించి అవగాహన ర్యాలీ చేపట్టారు.సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త సమయపాలన పాటించి పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లల బరువులు నమోదు చేయాలన్నారు. అధిక పౌష్టిక పదార్థాలు ఉండే చిరుధాన్యాలు తినడం ఎంతో ఉపయోగకరమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి, మంజుల, అన్నపూర్ణమ్మ, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

10 కొత్త బస్సులు ప్రారంభం



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి రూరల్: ప్రయాణికులకు మెరుగైన వసతి, సౌకర్యాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోకు నూతనంగా మంజూరైన 10 కొత్త బస్సు(5 సూపర్ డీలక్స్, 4 ఎక్స్‌ప్రెస్, 1 అల్ట్రాడీలక్స్)లను, రేణిమడుగుకు కొత్త పల్లె వెలుగు నూతన సర్వీసును ఆదివారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం డీఎం బి.శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యానికి అనుగుణంగా, సమయపాలనతో బస్సులు నడపాలని అధికారులను సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, సీఐ ఎస్కే ఖాజావలి, ఎస్సై టి.త్యాగరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఎస్కే ఫిరోజ్, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, తమ్మినేని వెంకటరెడ్డి, నజీముద్దీన్, చిన్నా, సురేష్, ఆర్టీసీ యూనియన్ల నాయకులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.